



# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY





PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | గురువారం 14-03-2024 | సంపుటి : 06 | సంచిక : 183 | పేజీలు : 8 | వెల : రూ 3-00

# ప్రజలు గెలవాలంటే వైకాపా ఓడిపోవాలి



**రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్**
**పోలవరం, అమరావతి పూర్తయివుంటే అభివృద్ధి జరిగేది**
**మహిళల కోసం కలలకు రెక్కలు కార్యక్రమం ఆవిష్కరణ**
**మహిళలకు అండగా పథకం రూపొందించిన టిడిపి**
**విద్యార్థినుల ఉన్నత చదువులకు రుణాల్లో హామీ**
**చదువులు పూర్తయ్యే వరకు వడ్డీమాఫీ**
**బస్సుల్లో ఉచిత ప్రయాణానికి హామీ**
**కార్యక్రమం ప్రారంభించిన టిడిపి అధినేత చంద్రబాబు**

అమరావతి,మార్చి13: టిడిపి హయాంలో డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి మహిళల్లో చైతన్యం తీసుకొచ్చామని.. ఇప్పుడు అవి ప్రపంచానికే ఆదర్శమయ్యాయని తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతి అభివృద్ధి చెంది, పోలవరం పూర్తయి ఉంటే రాష్ట్రానికి పరిశ్రమలు వచ్చి ఈపాటికి ఎక్కడో ఉండేవాళ్లం అన్నారు. ఈ రకంగా ఎపి పూర్తిగా వెనక్కి నెట్టబడిందన్నారు. విద్యా రాజధానిగా ఎదగాల్సిన రాష్ట్రం సర్వనాశనమైంది. ప్రజలు గెలవాలంటే వైకాపా ఓడి తీరాలని చంద్రబాబు అన్నారు. ఉండవల్లిలోని తన నివాసంలో 'కలలకు రెక్కలు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెదేపా కూటమి అధికారంలోకి రాగానే 'మహాశక్తి' కింద ఐదు కార్యక్రమాలు తీసుకొస్తామన్నారు. 'తల్లికి వందనం' పేరుతో ఏడాదికి రూ.15 వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు వచ్చాయంటే ఎన్టీఆర్ చొరవే అని వివరించారు. తెదేపా హయాంలో 22 కొత్త పథకాలు తీసుకొచ్చినట్లు గుర్తుచేశారు. ఒకప్పుడు ఐటీ అని తానంటే అందరూ నవ్వారని.. ఇప్పుడు ఆ రంగంలో ప్రపంచమంతా మనవాళ్లు ఉన్నారన్నారు. తెదేపా హయాంలో ఉద్యోగాలు, కళాశాల సీట్లలో రిజర్వేషన్లు తీసుకొచ్చాం. ఆడబిడ్డలకు రిజర్వేషన్లతో ప్రస్తుతం మగవారితో సమానంగా పని చేస్తున్నారు. మెరుగైన అవకాశాలిస్తే మరింత ముందుకెళ్తారు. ఉజ్వల భవిష్యత్తు కోసం ఆలోచించి ఆచరణ సాధ్యం చేసే పార్టీ తెలుగుదేశం. పిల్లల భవిష్యత్తు కోసం తెదేపా హయాంలో తీసుకొచ్చిన పథకాలతో ఎంతో మంది విదేశాలకు వెళ్లి స్థిరపడ్డారు. 'కలలకు రెక్కలు' వినూత్న కార్యక్రమం. మహిళలకు ఉండే అవకాశాలను గుర్తించి దీన్ని ప్రత్యేకంగా రూపొందించాం. నైపుణ్యాభివృద్ధి కోసం ఆడపిల్లలకు ఎంతైనా ఖర్చు పెట్టే పథకమిది. విద్యార్థినుల ఉన్నత చదువుల కోసం బ్యాంకు రుణాలు తీసుకునేలా మేం సహకరిస్తాం. వీటికి ప్రభుత్వమే వడ్డీ కడుతుంది. ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలబడాలి.. 2024 ఎన్నికల్లో జరగబోయేదిదే. భారత్‌లో ఆర్థిక సంస్కరణల వల్ల పెట్టుబడిదారులు పెరిగారు. దేశంలో యువత అధికంగా ఉండటం కలిసొచ్చే అంశం. ప్రధాని మోదీ చెబుతున్న వికసిత్ భారత్‌@2047 జరిగి తీరుతుంది. జగన్ పాలనలో జరిగిన విధ్వంసం వల్ల రాష్ట్రంలో ఏ వ్యవస్థా సక్రమంగా లేదు. రైతులు, యువత, కార్మికులు నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాలు నలిగిపోయాయని చంద్రబాబు ఆవేదన చెందారు. ఈ క్రమంలో మహిళల కోసం సరికొత్త పథకం 'కలలకు రెక్కలు' పేరుతో కొత్త కార్యక్రమానికి తెలుగు దేశం శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాన్ని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రారంభించారు. విద్యార్థినులు తమ పేర్లు రిజిస్టర్ చేసుకునే కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల కోసం టీడీపీ మొదటి నుంచి అనేక వినూత్న కార్యక్రమాలు చేపట్టిందన్నారు. టీడీపీ సూపర్ సిక్స్‌లో మహాశక్తి కార్యక్రమంతో మహిళా సంక్షేమం చేపట్టబోతున్నట్టు ఆయన చెప్పారు. గతంలో దీపం పథకం ప్రవేశపెట్టింది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. సూపర్ సిక్స్‌లో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు చెప్పారు. చదువుకోవాలని అనుకున్న ఆడపిల్లలకు ఆర్థిక పరిస్థితులు అనుకూలించక.. ఇంటికే పరిమితం కాకూడదన్న ఆశయంతో 'కలలకు రెక్కలు' అనే పథకానికి శ్రీకారం చుట్టామని చంద్రబాబు తెలిపారు.

## 16న ఇడుపులపాయకు సిఎం జగన్

**అక్కడే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన**

అమరావతి,మార్చి13: ఆంధ్రప్రదేశ్‌లో 'అభివృద్ధి.. సంక్షేమం.. సామాజిక న్యాయం'ను చూపెడుతూ మరోసారి అధికారం దక్కించుకునే దిశగా వైఎస్సార్‌సీపీ అడుగులు వేస్తోంది. ఇప్పటికే గరిష్టంగా శాసన సభ స్థానాలకు, పార్లమెంట్ నియోజకవర్గాలకు సమన్వయకర్తలను నియమించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అభ్యర్థుల తుది ప్రకటనకు రంగం సిద్ధమైంది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల



16వ తేదీన వైస్సార్ జిల్లా ఇడుపులపాయకు వెళ్లనున్నారు. వైఎస్సార్ ఘాట్ వేదికగా.. అసెంబ్లీ, లోక్‌నభ ఎన్నికల బరిలో నిలిచే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను స్వయంగా ప్రకటించనున్నారు. 2019 ఎన్నికల సమయంలోనూ ఇడుపులపాయ నుంచే అభ్యర్థుల లిస్ట్‌ను ఆయన ప్రకటించిన సంగతి గుర్తుండే ఉంటుంది. 16వ తేదీ నాటి ప్రకటన అనంతరం సీఎం జగన్ ఎన్నికల ప్రచారంలోకి దిగుతారని సమాచారం. ఉత్తరాంధ్ర నుంచి సిద్ధం గర్జనతో ఎన్నికల శంఖారావం పూరించిన సీఎం జగన్..మళ్లీ అదే ప్రాంతం నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి ఈ నెల 18వ తేదీన ప్రచారం మొదలుపెడతారని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ఇచ్ఛాపురం నుంచి మొదలుపెట్టి అదేరోజు విజయవాడ వెస్ట్, నెల్లూరు రూరల్‌లో ఆయన ప్రచారంలో పాల్గొనచ్చని తెలుస్తోంది. ఇలా రోజుకు రెండు లేదంటే మూడు బహిరంగ సభలు, రోడ్ షోలో సీఎం జగన్ పాల్గొనేలా పార్టీ వర్గాలు ఒక షెడ్యూల్‌ను రూపకల్పన చేస్తున్నాయి. ఇప్పటికే పార్టీ ముఖ్య నేతలు రూట్ మ్యాప్ పైన చర్చించినట్లు తెలుస్తోంది. క.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల జాబితా దాదాపు ఖరారైంది. ఇక.. ఇప్పటివరకు విడుదలైన జాబితాల వారీగా చూస్తే.. 77 అసెంబ్లీ స్థానాలకు, 23 పార్లమెంట్ స్థానాలకు ఇన్‌ఛార్జిలను నియమించింది. ఇక ఈ ఇన్‌ఛార్జిలనే ఎన్నికల్లో దాదాపుగా అభ్యర్థులుగా ఖరారు చేశామని.. ఒకట్రెండు చోట్ల మార్పులు ఉంటే ఉండొచ్చని మంగళగిరిలో జరిగిన పార్టీ కీలక సమావేశంలో పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా ప్రకటించిన సంగతి తెలిసిందే.

## 2018 గ్రూప్-1 మెయిన్స్ రద్దు

**ఆనాటి మూల్యాంకనపై సందేహాలు**
**రద్దుచేస్తూ హైకోర్టు ఆదేశాలు**
**అభ్యర్థులకు అండగా ఉంటామని ప్రభుత్వం హామీ**

అమరావతి,మార్చి13 2018లో ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 పరీక్షపై రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. గతంలో జరిగిన మెయిన్స్ పరీక్షను రద్దు చేసింది. జవాబు పత్రాలను మాన్యువల్ విధానంలో రెండుసార్లు మూల్యాంకనం చేశారంటూ కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. మొదటిసారి దిద్దిన ఫలితాలను తొక్కిపెట్టి, రెండోసారి దిద్దించి నచ్చిన వారిని ఎంపిక చేసుకొని ఏపీపీఎస్సీ ఫలితాలు ప్రకటించిందని ఆరోపించారు.



దీనిపై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. మెయిన్స్ జవాబు పత్రాలను పలుమార్లు మూల్యాంకనం చేయడం చట్టవిరుద్ధమని హైకోర్టు పేర్కొంది. ఎంపికైన అభ్యర్థుల జాబితాను రద్దు చేసిన ఉన్నత న్యాయస్థానం.. మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఆదేశించింది. ఎంపిక ప్రక్రియను 6 వారాల్లోపు పూర్తిచేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. 2018 గ్రూప్-1 నోటిఫికేషన్ ఆధారంగా మెయిన్స్ పరీక్ష రాసి ఎంపికైన అభ్యర్థుల జాబితాను రద్దు చేసింది. పరీక్ష పేపర్లను రెండవసారి, మూడవసారి మూల్యాంకనం చేయడం చట్టవిరుద్ధమని హైకోర్ట్ ప్రకటించింది. పరీక్షను తాజాగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. పరీక్ష నిర్వహణ, ఎంపిక ప్రక్రియను 6 వారాల్లో పూర్తి చేయాలని స్పష్టం చేసింది. అయితే 2018 గ్రూప్-1పై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అభ్యర్థులు ఆందోళన చెందవద్దని ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. ఆ నోటిఫికేషన్ కింద ఎంపికై ఉద్యోగాలు చేసుకుంటున్నవారి ప్రయోజనాలను కాపాడు తామని హామీ ఇచ్చింది. వారి తరపున న్యాయపోరాటం చేస్తామని, హైకోర్టు తీర్పుపై అప్పీలుకు వెళ్తామని హామీ ఇచ్చింది. తీర్పుపై ఎవరికీ ఆందోళన అవసరం లేదని, వారి ప్రయోజనాలను పరిరక్షిస్తామని ఈ సందర్భంగా పేర్కొంది.

## ఎన్నికల్లో వలంటీర్లకు విధులు

**ఇసి నిబంధనలకు విరద్ధమని పిటిషన్**

అమరావతి,మార్చి13: ఎన్నికలకు వాలంటీర్లను వినియోగించడంపై సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ హైకోర్ట్‌ను ఆశ్రయించింది. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని పేర్కొంటూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై బుధవారం ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ముందు విచారణ రాగా.. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చినా ప్రభుత్వం అమలు చేయడం లేదని పిటిషనర్ తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. సాక్ష్యాత్తు ముఖ్యమంత్రి, మంత్రులు ఎన్నికల్లో వాలంటీర్లు తమకు పని చేయాలని చెబుతున్నారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

## చిలకలూరిపేట సభ కోసం ఆంధ్రులంతా ఎదురుచూపు



**మోడీ, బాబు, పవన్ సభలకు భారీ ఎత్తున ఏర్పాట్లు**
**పార్టీ నేతలతో కలసి ఏర్పాట్లు పరిశీలించిన ప్రత్తిపాటి**



పల్నాడు,మార్చి13:టీడీపీ- జనసేన - బీజేపీ కూటమిని 5 కోట్ల ఆంధ్రులు స్వాగతిస్తున్నారని మాజీ మంత్రి,టిడిపి నేత ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... ఉమ్మడి కూటమి సభ కోసం దేశమంతా ఎదురుచూస్తోందన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ప్రధాని మోదీ, చంద్రబాబు , పవన్ దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. జగన్‌ను రాష్ట్రం నుంచి తరిమికొట్టే సభ కాబోతుందని అన్నారు. 175 నియోజకవర్గాల నుంచి 3 పార్టీల శ్రేణులు పాల్గొంటాయయని.. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. కాగా.. ఈ నెల 17న చిలకలూరిపేట బొప్పూడి వద్ద జరిగే టీడీపీ కూటమి ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభా స్థలిని బుధవారం ఉదయం యువనేత లోకేష్‌తో కలిసి ప్రత్తిపాటి పరిశీలించారు. లోకేష్‌తో పాటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్య నేతలతో కలిసి సభా స్థలాన్ని యువనేత పరిశీలించారు. వివిధ కమిటీలతో భేటీ అయ్యి సభ ఏర్పాట్ల గురించి లోకేష్ చర్చించారు. లక్షలాదిగా ప్రజలు రానున్న సందర్భంగా వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సభా ప్రాంగణం వద్ద భూమి పూజా కార్యక్రమంలో నారా లోకేష్, మూడు పార్టీల ముఖ్య నేతలు పాల్గొన్నారు. పొత్తు కుదిరిన తరువాత నిర్వహిస్తున్న మొదటి సభను మూడు పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ప్రధాని మోదీ పాల్గొనే సభ ఏర్పాట్లను నారా లోకేష్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

## వైసిపి నిర్ణయంతో మనసు గాయమైంది

**కావాలనే నన్ను పక్కన పెట్టారు**
**సర్వేలన్నీ అనుకూలంగా ఉన్నా పట్టించుకోరా**
**జగన్‌ను కలవకుండా చేస్తున్న తీరు బాధగా ఉంది**
**మీడియా సమావేశంలో తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి**

విజయవాడ,మార్చి13 : వైసీపీ అధిష్టానం చేసిన పనికి తన మనసు గాయపడిందని, వ్యక్తిగతంగా తాను చాలా బాధపడ్డానని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలోనే రాజకీయాలకు, వైసీపీ పార్టీకి కొంత కాలం దూరంగా ఉండనున్నట్టు చెప్పారు. తిరువూరు నియోజకవర్గంలో పదేళ్లు తాను పార్టీ కోసం కష్టపడ్డానని ఆయన తెలిపారు. తిరువూరులో తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి ఈ మేరకు మాట్లాడారు. 2014లో తాను గెలిచిన వెంటనే మున్సిపల్ ఎన్నికలు వచ్చాయి. పార్టీ క్యాడర్‌లోని నేతలందరినీ ప్రజా ప్రతినిధులుగా చేశాం. 2014లో మున్సిపల్, గ్రామ పంచాయితీల్లో ఓటమి చవి చూశాం. కానీ ఎమ్మెల్యేగా మాత్రం క్యాడర్ సహకారంతో గెలిచాను. ప్రతి పక్షంలో ఉన్నవారు సైతం మా గెలుపులో భాగస్వామ్యం అయ్యారు. పార్టీ కార్యక్రమాల్ని తుచా తప్పకుండా ప్రచారం చేశాం. క్యాడర్‌ను బలోపేతం చేశాం. 2021లో మున్సిపాలిటీని వన్ సైడేడ్‌గా గెలిపించుకున్నాం. 63 ఎంపీటీసీలకు 61 గెలిచాం. నాలుగు జడ్పీటీసీలను ఎంపీపీలను గెలిచాం. ఎమ్మెల్యే ఫండ్, సొంత నిధులతో తిరువూరు నియోజకవర్గన్ని అభివృద్ధి చేశా. చైర్మన్ పీఠం మార్పు కోసం 16 మంది కౌన్సిలర్ల ఆమోదంతో మరొకరికి అవకాశం కల్పించేందుకు చూశాం. కానీ అధిష్టానం ఆదేశాలతో నిలిచిపోయింది. కష్టపడితేనే సీటు అన్నారు. ఎండ, వాన, చలి అనే తేడా లేకుండా ప్రతి గడప గడపకు తిరిగి కష్టపడ్డాను. రాష్ట్రంలో గడప గడపను మొదటగా నేనే పూర్తి చేశాను. సీఎం జగన్ రివ్యూ పెట్టారు. ప్రతి రివ్యూలో మొదటి పది స్థానాల్లో నేను ఉన్నాను. తిరువూరులో 69? నేనే కావాలని సర్వేల్లో తేలింది. అభ్యర్థి నేనే అని చెప్పారు. కానీ మళ్లీ సర్వే చేశారు. తిరువూరులో ఎందుకు నన్ను కాదని సర్వే చేశారు. అసలు తిరువూరులో పరిచయం లేని కొత్త అభ్యర్థుల పేర్లను ఐవీఆర్ఎస్ సర్వేల్లో పెట్టారు. అధిష్టానానికి విధేయుడిగా ఉన్న నన్ను పక్కన పెట్టడంలో మర్మం ఏమిటి అంటూ ప్రశ్నించారు.

## కవయిత్రి మొల్లకు సిఎం జగన్ నివాళి



అమరావతి,మార్చి13 : 16వ శతాబ్దపు తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ మొల్ల జయంతి సందర్భంగా సిఎం జగన్ ఆమెకు నివాళి అర్పించారు. మొల్ల జయంతి సందర్భంగా ఆమె చిత్రపటం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతి సందర్భంగా సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి సీఎం జగన్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్‌లు వరుదు కళ్యాణి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఏపీ శాలివాహన కార్పొరేషన్ ఛైర్మన్ మండేపూడి పురుషోత్తంలు పాల్గొని నివాళులు అర్పించారు. ఇక, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మొల్ల జయంతిని అధికారికంగా నిర్వహిస్తోంది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది.

## బొప్పూడి వద్ద సభకు భూమిపూజ

**పాల్గొన్న మూడు పార్టీల నేతలు**

చిలకలూరిపేట,మార్చి13 : పల్నాడు జిల్లా చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద ఈ నెల 17న భారీ బహిరంగ సభకు టిడిపి, జనసేన, బిజెపిలు ఏర్పాట్లు చేస్తున్నారు. తెదేపా-జనసేన- భాజపా ఉమ్మడిగా నిర్వహిస్తున్న ఈ సభకు ఏర్పాట్లు ప్రారంభమ య్యాయి. దీనికి సంబంధించిన భూమి పూజలో తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తో పాటు మూడు పార్టీల నేతలు పాల్గొన్నారు.

# సంపాదకీయం

గురువారం 14-03-2024

## మార్మోగుతున్న మోడీ గ్యారెంటీలు !

పార్లమెంట్ ఎన్నికల ముందు ప్రధాని మోడీ సుడిగాలి పర్యటనలు చేపట్టారు. మోడీ గ్యారెంటీ అంటూ లక్షల కోట్ల పనులకు శంకుస్థాపనలు చేస్తున్నారు. ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. ఎన్నికల కోసం కాదు..అభివృద్ధి కోసం అంటూ ప్రజలను నమ్మిస్తున్నారు. పత్రికలు, టీవీల్లో వ్యాపార ప్రకటనలు కోకొల్లలుగా వస్తున్నాయి. గతంలో 2004లో భారత్ వెలిగిపోతోందన్న తరహాలో..ఇప్పుడు మోడీ గ్యారెంటీ మార్మోగుతోంది. నిజానికి పార్లమెంటులో ఏ ఒక్క సమస్యపైనా మాట్లాడని మోడీ పార్లమెంట్ వెలుపల మాత్రం మోత మోగిస్తున్నారు. కొత్తగా కట్టిన పార్లమెంట్ కేవలం చూడ్డానికే అన్నట్లుగా మొన్నటి శీతాకా, బడ్జెట్ సమావేశాలు ముగిసాయి. ఇప్పుడేమో మోడీ, అమిత్ షాలు ఇద్దరూ భారతదేశ దశ మొత్తం మారిందని, గత పదేళ్లలో మార్చేశామన్న రీతిలో సాగుతున్నారు. మంత్రులు ఎవరు కూడా దేశంలో ఎక్కడా ఒక్క ప్రారంభోత్సవం చేయడం లేదు. చివరకు వందేభారత్ రైలుకు కూడా మోడీ జెండా ఊపాల్సిందే. హైదరాబాద్ వచ్చిన అమిత్ షా కెసిఆర్, బిఆర్ఎస్ అక్రమాలు, అవినీతి గురించి మాట్లాడారు. పదేళ్లలో ఒక్కటంటే ఒక్క చర్య తీసుకోలేదు. అలా తీసుకోలేనందుకు కారణాలు చెప్పకుండా అవినీతి గురించి మాట్లాడారు. కొత్తగా వచ్చిన రేవంత్ సర్కార్‌కు సవాళ్లు విసిరారు. ఊకదంపుడు ఉపన్యాసాలు, ఆరోపణల్లో బిజెపి ఆరితేరింది. అయోధ్య రామాలయ నిర్మాణం, 370 ఆర్టికల్, ట్రిపుల్ తల్లాక్ వంటివి చూపి దేశాన్ని అద్భుతం చేశామని ప్రచారం చేసుకుం టున్నారు. అవినీతి లేదని చెప్పుకుంటున్న నేతలు కర్నాటకలో బిజెపి పాలనలో జరిగిన అవినీతి గురించి చర్యలు తీసుకోలేదు. ఎపిలో జగన్ అవినీతిపై చర్యలు లేవు. కెసిఆర్ అవినీతిపైనా చర్యలు లేవు. కేవలం కేజ్రీవాల్, హేమంత్ సోరెన్‌ల అవినీతి మాత్రమే వారికి కనిపిస్తోంది. నిజానికి జిఎస్టీ వల్ల ఎంతగా భారం పడుతుందో చర్చించరు. నిరుద్యోగం, ఉపాధి లేమి, ధరల పెరుగుదల గురించి మాట్లాడరు. ఇవన్నీ చెప్పకుండా అయోధ్య, కాశ్మీర్, ట్రిపుల్ తల్లాక్ చెప్పి తప్పించుకుంటున్నారు. ఇంతకన్నా దారుణం మరోటి ఉండదు. భారతదేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతోందంటూ కాంగ్రెస్ గురించి ఆరోపణలు చేస్తారు. వారసత్వ రాజకీయాలతో కాంగ్రెస్‌పై దాడి చేస్తారు. దక్షిణాదిలో పాగా వేయాలనకున్న నేతలకు కనీసం పోటీ చేసే నాయకులను కూడా తయారు చేసుకోలేక పోయారు. ఇతర పార్టీల నుంచి వస్తే తప్ప పోటీకి అభ్యర్థులు లేరు. గత ఎన్నికల ముందు పార్టీలో చేరిన వారంతా బయటకు వెళుతున్నా చేవ చచ్చినట్లుగా మిన్నకున్నారు. తాము చెబుతున్న మాటలు, నీతులు ప్రజలు ఎలా స్పందిస్తారన్న ఆలోచన కూడా వారిలో కానరావడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పాగా వేస్తామని మాత్రం ప్రకటించు కుంటున్నారు. ఎపిలో పొత్తులు లేకుంటే దిక్కులేదు. ఒక్క అసెంబ్లీ కూడా ఒంటరిగా సాధించలేని దుస్థితిలో బిజెపి ఉంది. టిడిపి, జనసేనలతో పొత్తు కారణంగా బిజెపికి ఒకటి రెండయినా సీట్లు దక్కగలవు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల బరిలో 8 స్థానాలను సాధించి బలం పెంచుకున్న బీజేపీ.. పార్లమెంటు ఎన్నికల్లోనూ సత్తా చాటాలని భావిస్తోంది. ఎంపీ ఎన్నికల్లో వీలైనన్ని ఎక్కువ సీట్లు గెలుచుకుని మరింత బలపడాలని వ్యూహం రచిస్తోంది. ఈ ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో విజయం సాధించడం ద్వారా తమ ఓటు బ్యాంకును మరింత పెంచుకుని రాష్ట్రంలో బీఆర్ఎస్ను వెనక్కి నెట్టేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందుకే మరోమారు బిఆర్ఎస్, కాంగ్రెస్ అవినీతిపై విమర్శలు ఎక్కుపెడుతున్నారు. ఇటీవల అమిత్ షా పర్యటనలో జరిగిన సభలో చేసిన విమర్శలే ఇందుకు నిదర్శనంగా చూడాలి. అందులో భాగంగానే ఎంపీ అభ్యర్థుల విషయం లో కాషాయ పార్టీ దూకుడుగా వ్యవహరిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా కమల దళంలోకి వలస వచ్చే నేతలకు అగ్ర తాంబూలం ఇస్తోంది. వారినే అభ్యర్థులుగా ప్రకటించుకుంటోంది. జహీరాబాద్‌లో బిబి పాటిల్, నాగర్ కర్నూలులో ఎంపి రాములు తనయుడికి టిక్కెట్లు ఇచ్చారు. ఇప్పుడు మహబూబాబాద్‌లో సీతరామ్ నాయక్‌కు సీటు ఇవ్వబోతున్నారు. క్రమశిక్షణకు మారుపేరుగా ఉండే కాషాయ పార్టీలో వలస నేతలకు టికెట్లు కేటాయించడంపై అసంతృప్తి జ్వాలలు భగ్గుమంటున్నాయి. మల్కాజ్‌గిరి నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ మురళీధర్‌రావు తన భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తానని ఇటీవల ట్వీట్ చేసిన విషయం తెలిసిందే. పార్టీలో సభ్యత్వం లేని వ్యక్తికి హైదరాబాద్ టికెట్ ఇవ్వడమేంటని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. నిజామాబాద్ టికెట్ దక్కిన ధర్మపురి అర్వింద్‌పై స్థానిక నేతలు ఢిల్లీలో మీడియా సమావేశం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇలా ఎన్నడూ లేనివిధంగా పార్టీ ప్రకటించిన అభ్యర్థులకు వ్యతిరేకంగా అసంతృప్త జ్వాలలు చెలరేగడం కమల దళంలో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. రెండో జాబితా ప్రకటించిన తర్వాత పార్టీలో అసమ్మతి సెగలు మరింత ఎక్కువగా ఉంటాయనే చర్చ జరుగుతోంది. అయితే సొంతంగా బలం ఉన్న నేతలు లేకపోవడంతో ..రాష్ట్రంలో పాగా వేసేందుకు వలసతపై ఆధారపడుతోంది. లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో వారే స్వయంగా ఇతర పార్టీల నేతల దగ్గరికి వెళ్లి మంతనాలు జరుపుతున్నారు. పార్టీలో చేరితే టికెట్ పక్కా అంటూ హామీ ఇస్తున్నారు. బీఆర్ఎస్‌కు భవిష్యత్తులో లేదని వివరిస్తూ.. తామే ప్రధాన ప్రత్యర్థి అని నమ్మకం కలిగిస్తూ నేతల చేరికలను ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో బీజేపీ లోక్‌సభ అభ్యర్థుల తొలి జాబితాలో రాష్ట్రంలోని తొమ్మిది సీట్లకు పోటీ చేయబోయే వారి పేర్లను ప్రకటించింది. అందులో జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు కుమారుడు భరత్‌కు పార్టీలో చేరిన వెంటనే టికెట్లను ఖరారు చేసింది. దీంతో ఆయా స్థానాలపై ఆశలు పెట్టుకుని పార్టీని నమ్ముకున్న వారు ఆగ్రహంగా ఉన్నారు. బీజేపీ నేడో రేపో విడుదల చేసే రెండో జాబితాలో రాష్ట్రంలోని మిగిలిన సీట్లకూ అభ్యర్థులను ప్రకటించనుంది. మొత్తం 17 స్థానాల్లో మిగిలిన మహబూబ్‌నగర్, మహబూబాబాద్, ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్, నల్లగొండ, పెద్దపల్లి, మెదక్ సీట్లకు అభ్యర్థులను ప్రకటిస్తారు. ఈ సీట్లలో అభ్యర్థిత్వం గురించి వినిపించే పేర్లలో ఏ ఒక్కరూ కూడా ఏళ్లకుఏళ్లుగా పార్టీని నమ్ముకుని ఉన్నవారు లేకపోవడం గమనార్హం. మహబూబా బాద్ నుంచి సీతారాం నాయక్, ఖమ్మం నుంచి జలగం వెంకట్రావు, ఆదిలాబాద్ నుంచి నగేశ్, నల్లగొండ నుంచి శానంపూడి సైదిరెడ్డి అభ్యర్థిత్వాలు ఖరారైనట్లు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నలుగురూ ఇటీవలే బీఆర్ఎస్ నుంచి కమలం పార్టీలో చేరారు. వరంగల్ టికెట్ బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్, పెద్దపల్లి టికెట్‌ను బీఆర్ఎస్‌తో అత్యంత సన్నిహితంగా ఉంటున్న మిట్టపల్లి సురేందర్‌కు ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. మెదక్ సీటుకు రఘునందన్‌రావు.. మహబూబ్‌నగర్ స్థానం కోసం డీకే అరుణ, జితేందర్‌రెడ్డి పోటీపడుతుండగా.. వీరెవరూ బీజేపీలో కింది స్థాయి నుంచి పనిచేసుకుంటూ వచ్చిన వారు కాదు.

## ముఖ్యమంత్రి కాన్వాయ్ ట్రయిల్ రన్ నిర్వహించిన జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 13-మార్చి 14 న ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు పటిష్టమైన బందోబస్త్ ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పి కె. రఘువీర్ రెడ్డి తెలిపారు. మార్చి 14న బనగానపల్లి టౌన్ కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విచ్చేయుచున్న నేపథ్యంలో బుధవారం జిల్లా ఎస్పీ భద్రత ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు.అనంతరం జిల్లా ఎస్పీ బందోబస్తుకు వచ్చిన పోలీస్ అధికారులను, సిబ్బందిని బనగానపల్లి టౌన్ నందుగల జీ ఎమ్ ఆర్ ఫంక్షన్ హాల్ లో సమావేశం ఏర్పాటు చేసి బందోబస్తు విధులను నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన ప్రదేశంలో నిర్దేశించిన సమయానికి విధులలో హాజరుగా ఉండాలనీ బ్రీఫింగ్ చేశారు.సభకు ఎక్కువ సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉండడంతో దానికి అనుగుణంగా అధికారులను సిబ్బందిని విధులకు కేటాయించడం జరిగిందన్నారు .మొత్తం సుమారు 1298 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చెయ్యడం జరిగిందన్నారు. వీరిలో ఇద్దరు అడిషనల్ ఎస్పీ లు , 11 మంది డిఎస్పీ లు, 42 మంది సిఐ లు, 85 మంది ఎస్.ఐ లు ,ఎ ఎస్సై లు. హెడ్ కానిస్టేబుళ్లు 324 మంది,పోలీసులు 565 మంది, లు 66 మంది,హోంగార్డ్ లు 204 మంది ఉన్నారు. వీరు కాకుండా ఏ.అర్ ఫోర్స్ , స్పెషల్ ఫోర్స్ .బీడీ టీమ్స్ మొదలగునవి ఉన్నారు.హెలిప్యాడ్, సభా వేదిక ప్రాంతం, గ్యాలరీలో ఇరువైపులా విధులు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. బస్సులు , కార్లు ,మొదలగు ఇతర వాహనాలు వారికి కేటాయించిన ప్రదేశాలలో పోలీస్ సిబ్బంది ఒక వరుస క్రమంలో వాహనాలను పార్కింగ్ చేయించాలన్నారు. బందోబస్తు విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది అందరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, ఎక్కడ అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సిబ్బంది అందరూ తమకు కేటాయించిన పాయింట్ల వద్ద అప్రమత్తంగా మెలగాలని సూచించారు. ఎవరైనా తమ విధులలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.అనంతరం హెలిప్యాడ్ నుండి సభా వేదిక వద్ద వరకు కాన్వాయ్ ట్రైల్ రన్ నిర్వహించి, అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు తెలియ చేశారు.

## మహిళలు ఆర్థికంగా భలోపేతం కోసమే చేయూత



-----విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 13- మహిళలు ఆర్థికంగా భలోపేతం కోసం నాలుగో విడత చేయూత చెక్కులనునంద్యాలనియోజకవర్గంలోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ భాష,మార్క్ ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి పంపిణీ చేశారు. బుధవారం నంద్యాల మున్సిపల్ టౌన్ హాల్ నందు క్రాంతి పథకం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) అద్వర్యం లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గంలోని 45-60 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న అర్హులైన ప్రతి ఎస్సి ఎస్టీ బిసి మరియు మైనారిటీ అక్క చెల్లమ్మలకు వర్తింపుగా ప్రతి సంవత్సరం 18.750/- చొప్పున ఇప్పటివరకు 4 సంవత్సరాలు కు గాను 75,000/- ఆర్థిక సహాయం అందించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో 8.390 మంది లబ్ధిదారులకు రూ1573.13లక్షలు ,నంద్యాల మండల పరిధిలో 3.660 మంది లబ్ధిదారులకు రూ 686.25 లక్షలు ,గోస్పాడు మండల పరిధిలోని 2.258 మంది లబ్ధిదారులకు రూ 423.328 లక్షలు చెక్కులను ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి ,ఎమ్మెల్సీ ఇషాక్ భాషా, మార్కెఫెడ్ చైర్మన్ పి పీ నాగిరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా లబ్ధిదారుల కు అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి. మెప్మా సీ ఎం ఎం విజయ భాస్కర్ రెడ్డి. అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి. మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వరరెడ్డి,రాష్ట్ర దృశ్యకళాల డైరెక్టర్ సునీత అమృత రాజ్, డైరెక్టర్ శశికలరెడ్డి, బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్,నంద్యాల ఎంపీపీ శెట్టి ప్రభాకర్,నంద్యాల జుల్లా మహిళ అ ద . ్య క ్ు ం ా ల ం శకుంతలమ్మ,మున్సిపల్ వైస్ చైర్మన్ పామ్ శవాలి, కౌన్సిలర్స్ కో ఆప్షన్ సభ్యులు సర్పంచులు ఎంపీటీసీలు వార్డు వైసిపి నాయకులు గ్రామ వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణం ఎన్నికల నిర్వహిస్తామ్

---సీఐ నాగభూషణం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 13- ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహిస్తామని ఆత్మకూరు సీఐ నాగభూషణం. వెలుగోడు ఎస్సై భూపాలుడు. ఆత్మకూరు టౌన్ ఎస్సై నారాయణ రెడ్డి పేర్కొన్నారు. వారు బుధవారం ఓ ప్రకటన లో మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి గారి ఆదేశాల మేరకు ఆత్మకూరు డిఎస్పి శ్రీనివాసరావు గారి సూచనలతో రానున్న సార్వత్రికఎన్నికలు-2024 దృష్ట్యా వెలుగోడు టౌన్ నందు ఆత్మకూరు రూరల్ సిఐ నాగభూషణం , వెలుగోడు ఎస్ఐ భూపాలుడు ,ఆత్మకూరు టౌన్ యస్ఐ నారాయణ రెడ్డి ,బిఎస్ఎఫ్ సిబ్బంది,వెలుగోడు పోలీస్ సిబ్బందితో కలిసి వెలుగోడు టౌన్ లోని , పీ ఎస్ ఆర్ సెంటర్. ఓల్డ్ బస్టాండ్. యసీ కాలనీ ,లలో కవాతు నిర్వహించామని తెలిపారు .ఓల్డ్ బస్టాండ్ నందు పబ్లిక్ మీటింగ్ ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా ఆయా వార్డ్ ప్రజలకు ఎలక్షన్ గురించి అవగాహన కార్యక్రమము నిర్వహించామని తెలిపారు . ఎవరైనా ఆవాంచనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు . ప్రజలు అందరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతవరణం కల్పించడమే పోలీసుల ధ్యేయమని ప్రజల్లో భరోసా కల్పించారు

## ప్రభుత్వ కనీస మద్దతు ధరతో జొన్నలు కొనుగోలు

- - - జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి

---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 13-ప్రభుత్వ కనీస మద్దతు ధరతో రైతుల నుండి జొన్నలను (మహీంద్రా రకం) క్వింటాలు ధర 3,180 రూపాయలతో మార్కెఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల నెం. 255 తేది 12-8-2024 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ కోటా కింద మహేంద్ర వెరైటీ సి-43 జొన్నలను ఈ క్రాప్, ఈకేవైసీ చేయించుకున్న రైతుల నుండి మార్కెఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామన్నారు.జిల్లాలోని రైతులు ఎవరయితే పౌర సరఫరాల శాఖకు ఇప్పటి వరకు జొన్నలు అమ్మకాలు చేయలేదో వారు మాత్రమే మార్క్ ఫెడ్ కి జొన్నలు విక్రయించేందుకు అర్హులని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి . మార్కపెడ్ మేనేజర్ నాగరాజు తెలిపారు . ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చిన్న, సన్న కారు రైతులకు ప్రయోజనం కలిగేలా గరిష్టంగా ఒక రైతుకు 5 ఎకరాల పరిమితిని విధించడం జరిగిందన్నారు. రైతులకు అవసరమైన గోనెసంచులను మార్క్ ఫెడ్ వారే సరఫరా చేస్తారన్నారు. అలాగే రవాణా సౌకర్యం కూడా మార్క్ ఫెడ్ వారే కల్పిస్తారన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితులలో గోనెసంచులు రైతులే తెచ్చుకున్న వాటిని తిరిగి గోనెసంచుల కాంట్రాక్టర్ నుండి తీసుకొని సెంటర్ ఇంచార్జి ద్వారా తిరిగి ఇచ్చేస్తామన్నారు. అలాగే రైతులు సొంత వాహనాలు రవాణాకు ఉపయోగించిన వాటికి సంబందించి బాడుగ కూడా ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్ నుండి రైతుకు తిరిగి చెల్లించే ఏర్పాటు చేస్తామన్నారు. రైతులు వారి సరుకును జల్లి పట్టి గోనెసంచులలో నింపి లారీలో లోడ్ చేసే వరకు అయ్యే హమాలీ ఖర్చు మాత్రమే రైతులు భరించాల్సి ఉంటుందన్నారు. జొన్నలు కొనుగోలు సమయంలో బయో మెట్రిక్ వేయుటకు రైతు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకొని త్వరితగతిన తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవలసినదిగా జాయింట్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.గతంలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 22 వేల మెట్రిక్ టన్నుల జొన్నలను కనీస మద్దతు ధరతో పౌరసరాఫరాల సంస్థ కొనుగోలు చేసిందన్నారు. ప్రధానంగా గడివేముల, వెలుగోడు, పాములపాడు, నంద్యాల, సిరివెళ్ల, ఆళ్లగడ్డ, గోస్పాడు, బండి ఆత్మకూరు మండలాల రైతుల నుండి ప్రభుత్వ మద్దతు ధరతో మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు జెసి తెలిపారు. జిల్లాలో 14,850 మెట్రిక్ టన్నుల వరకు రైతులు విక్రయించేందుకు ముందుకు వస్తున్నట్లు ఆయన ప్రకటనలో తెలిపారు. రైతుల నుండి కొన్న సరుకులను ఎస్డబ్ల్యుసి, సిడబ్ల్యుసి, మార్కెఫెడ్ గోడౌన్ లలో భద్రపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జెసి వివరించారు.



## భారీ నష్టాల్లో ముగిసిన సూచీలు

### 900 పాయింట్ల నష్టంతో ముగిసిన సెన్సెక్స్ దాదాపు రూ.13 లక్షల కోట్లు ఆవిరి

ముంబయి,మార్చి13 ): దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ కుదుపునకు లోనయ్యాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. ఒక్కసారిగా భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. సెన్సెక్స్ ఓ దశలో 1100 పాయింట్లకు పైగా నష్టపోయి చివరికి 900 పాయింట్ల నష్టంతో ముగిసింది. నిఫ్టీ 22 వేల దిగువకు చేరింది. ముఖ్యంగా రిలయన్స్, ఎన్టీపీసీ, ఎల్అండ్‌టీ వంటి ప్రధాన షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి. సెబీ చీఫ్ వ్యాఖ్యల నేపథ్యంలో స్మాల్, మిడ్ క్యాప్ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 5 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 4 శాతం చొప్పున నష్టపోయాయి. బీఎస్ఈలో మదుపరుల సంపదగా పరిగణించే నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ దాదాపు రూ.13 లక్షల కోట్లు ఆవిరైంది. వాటి మార్కెట్ విలువ రూ.372 లక్షల కోట్లకు చేరింది. గత నెలలో దేశంలో వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం రేట్ స్వల్పంగా తగ్గడంతోపాటు.. అంతర్జాతీయ మార్కెట్ లో ఉన్న పరిస్థితులే దేశీయ స్టాక్ మార్కెట్ల పతనానికి కారణంగా తెలుస్తోంది. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సెన్సెక్స్.. 11 గంటల తర్వాత నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 72,515.71 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 906.07 పాయింట్ల నష్టంతో 72,761.89 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 338 పాయింట్లు నష్టంతో 21, 997.70 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 82.85గా ఉంది. సెన్సెక్స్ 30లో ఐటీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, కోటక్ మహీంద్రా, నెస్లే ఇండియా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, టాటా స్టీల్, టాటా మోటార్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 82.98 డాలర్ల వద్ద, బంగారం ఔన్సు 2,163 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి. స్టాక్ మార్కెట్లో పలు చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్ల ధరలు బుడగల్లా పెరుగుతూ వస్తున్నాయని, అవి ఏమాత్రం సహేతుకంగా కనిపించడం లేదని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఛైర్‌పర్సన్ మాధబి పురి బచ్ ఇటీవల పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్స్ స్మాల్‌క్యాప్ సెగ్మెంట్‌లో కొత్త సబ్‌స్క్రిప్షన్‌ను తాత్కాలికంగా నిలిపివేసింది. కొన్ని బ్రోకరేజీ సంస్థలు, ఇన్వెస్టర్లు కూడా సెబీ చీఫ్ వ్యాఖ్యలను సమర్థించడంతో ఆయా స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది.

# నిజాం నిరంకుశపాలనకు, పెత్తందారి వ్యవస్థకు, వెట్టిచాకిరిలకు వ్యతిరేకంగా పోరాడి అసువులు బాసిన గొప్ప విప్లవవీరుడు అనభేరి ప్రభాకర్ రావు

**-నేడు ఆయన 76వ వర్ధంతి**

నిజాం నిరంకుశపాలనకు, పెత్తందారి వ్యవస్థకు, వెట్టిచాకిరిలకు వ్యతిరేకంగా పోరాడి అసువులు బాసిన గొప్ప విప్లవవీరుడు మన అనభేరి ప్రభాకర్ రావు,కొందరి చావు చరిత్రకు ప్రాణం పోస్తది... త్యాగానికి చిరునామగా నిలుస్తది. స్పూర్తిగా నిలిచి గుండే గుండేను తట్టిలేపి ఉద్యమాలకు ఊపిరిపోస్తది. ఎదురు తిరగడం.. తుపాకీ గొట్టానికి ఎదురేగడం.. రొమ్ములు నిక్కబొడిచి దమ్ముంటే కాల్చురా..? అని గర్జించడం వీరులకు మాత్రమే సాధ్యమైతది. అనుభవించాడనికి అన్ని ఉన్న విద్య నేర్పిన విజా&జనంతో పేదలకోసం ... సాయుధ పోరాటం చేసి తొలి అమరుడైన అనభేరి ప్రభాకర్ రావు 76వ వర్ధంతి నేడు. 15 ఆగస్టు 1910 లో కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోలేపల్లి గ్రామంలో ఓ తిరుగుబాటు జెండా పుట్టింది. అణచివేయబడుతున్న జనం కోసం ఓ ఉద్యమ కెరటం ఉదయించింది. ఆ జెండే అనభేరి ప్రభాకర్ రావు. ప్రభాకర్ రావు ఇంటిపేరు అనభేరి.. చేసింది రణభేరి. వెంకటేశ్వర్ రావు దేశ్ ముఖ్ , రాధాబాయిల గారాల బిడ్డ అనభేరీ ప్రభాకర్ రావు. ఈయన భార్య పేరు సరళాదేవి. వీరికి నాలుగురు సంతానం. భూస్వామ్య కుటుంబంలో పుట్టిన అనభేరి.. మచిలీపట్నం హిందూ హైస్కూల్ లో ప్రాథమిక విద్యను , హైదరాబాద్ చాదర్ ఘాట్‌లో హైస్కూల్ విద్యను , నిజాం కాలేజిలో ఇంటర్ పూర్తి చేసి బనారస్ లోని కాశీ విద్యపీఠ్ లో ఉన్నత విద్యనభ్యసించారు. పై చదువులకు బనారస్ వెళ్లొచ్చిన అనభేరి సక్కగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం బాటపట్టిండు.దొరల పేరు చెబితే ఆ రోజుల్లో ఊళ్లన్ని వణికిపోయేవి. కానీ అనభేరీ ప్రభాకర్ రావు దొర పేరు చెబితే మాత్రం చేతులెత్తి దండంపెట్టేవారు. ఇప్పటికి అనభేరి అంటే అదే ప్రేమ అదే గౌరవం. దొర అని పిలుచుకునే అనభేరి ప్రభాకర్ రావు ప్రజల మనిషి అయ్యిండు. నైజాం అరాచాకాలను ఎదురించే మొనగాడైండు. వెట్టిచాకీరి , బానిసత్వాలను తన ఇంట్లో నుంచే సంస్కరించిన ప్రభాకర్ రావు .. రైతులకు సుంఖం నుంచి విముక్తి కలిగించిండు:ుండెల పుట్టిన మంట గూట్లే ఉండనియ్యదంటరు. కడుపుల సల్ల కదలకుండ సుఖపడే ఇంట్ల పుట్టినా.. గుండెలో చదువు రగిలించిన స్వేచ్ఛ నినాదం అనభేరిని కుదురుగా ఉండనియ్యలేదు. సదువు పూర్తి చేసుకొని ఇంటికివచ్చిన అనభేరి కుటుంభాన్ని విడిచి నేరుగా తెలంగాణ సాయుధ రైతంగా పోరాటం బాటపట్టిండు. అజా&జతంలోకి వెళ్లిన అనభేరి ఊరూరా దొరల గడీలపై దాడులు చేసి దస్తావేజులను దగ్ధం చేసిండు. విప్లవ కెరటమై నైజాం సర్కారును గజ్జుమనిపించాడు. అయితే 1948 మార్చి 14న ద్రోహులు అనభేరి కదిలికల గురించి నిజాం సైన్యానికి సమాచారం అందించడంతో.. రజాకార్లు , నిజాం సైన్యం భోజనం చేస్తున్న అనభేరి టీంపై కాల్పులకు దిగింది. కాల్పులను ప్రతిఘటిస్తూ హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గుట్టల్లోకి వెళ్లింది. కానీ దురదృష్టం వెంటాడింది... అనభేరి ప్రభాకర్ రావు ఈ కాల్పుల్లో వీరమరణం పొందిండు. ప్రభాకర్ రావుతో పాటు మరో 12 మంది ఉద్యమకారులు చనిపోయారు.అనభేరి ప్రభాకర్ రావు మరణం రజాకార్లు.. నిజాం సైన్యానికి కొండంత సంతోషాన్నిచ్చింది. అనభేరి మరణం తరువాత ఆయన కోటును మరణసూచకంగా ఓ చెట్టుకు వేలాడదీసిన నిజాం సైన్యం షేర్ మరగయారే.. అంటూ నినాదాలు చేశారు. ఉద్యమకారులను ఊళ్లోకి తీసుకొచ్చి సమూహిక దహనం చేశారు. అనభేరి రణం ఆగిపోవడంతో పేదలు ఉద్యమకారులు కన్నీరు మన్నీరైండ్రు. అనేక మంది ఉద్యమకారులు యేండ్లకొద్ది అనభేరి ప్రభాకర్ రావు స్పూర్తిగా ఉద్యమం కొనసాగించారంటే అనభేరి ఉద్యమం ప్రజల్లో ఎంత ప్రభావం చూపిందో అర్ధం చేసుకోవచ్చు. అందుకే ఉద్యమకారులంతా అనభేరి గుర్తుగా గ్రామంలోని గుట్టవద్ద అనభేరి సమాధిని నిర్మించారు.

# ఎమ్మెల్యే పదవికీ రాజీనామా చేసిన మనోహల్ లాల్ ఖట్టర్



సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ హర్యానా రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యమంత్రి పదవికి మనోహర్ లాల్ ఖట్టర్ మంగళవారం ఊహించని విధంగా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన తన ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేశారు ఖట్టర్ కర్నాల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రాష్ట్ర అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం తెలిసిందే. 2014 నుంచి ఆయన ఇదే స్థానం నుంచి గెలుపొందుతూ వస్తున్నారు. 2019లో కూడా ఇదే నియోజకవర్గం నుంచి గెలుపొంది రాష్ట్ర సీఎంగా బాధ్యతలు చేపట్టారు. అయితే, లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆయన అనూహ్య నిర్ణయాలు తీసుకున్నారు. నిన్న ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన ఖట్టర్.. నేడు ఎమ్మెల్యేగా కూడా రిజైన్ చేసేశారు. అయితే, బీజేపీ అధిష్ఠానం తనకు ఏ బాధ్యత అప్పగించినా అంకితభావంతో పనిచేస్తానని ఈ సందర్భంగా మనోహర్ లాల్ ఖట్టర్ తెలిపారు. కాగా, ఖట్టర్ రాజీనామాల వెనుక బలమైన కారణాలే ఉన్నాయని స్థానికంగా చర్చ జరుగుతోంది. కర్నాల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఖట్టర్‌ను కమలం పార్టీ బరిలోకి దింపే యోచనలో ఉందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇందుకోసమే ఆయన సీఎం పదవికి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి పదవికి మనోహర్ లాల్ ఖట్టర్ ఊహించని విధంగా రాజీనామా చేయడంతో.. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు అనివార్యమైంది. దీంతో సాయంత్రానికే హర్యానాలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. స్వతంత్రుల మద్దతుతో రాష్ట్రంలో బీజేపీ కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బీజేపీ కొత్త శాసనసభాపక్ష నేతగా ఆ పార్టీ హర్యానా అధ్యక్షుడు నాయబ్ సింగ్ సైనీ ని బీజేపీ ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో మంగళవారం సాయంత్రం హర్యానా కొత్త ముఖ్యమంత్రిగా సైనీతో గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ నేపథ్యంలో సైనీ నేడు రాష్ట్ర అసెంబ్లీలో బలపరీక్షను కూడా నెగ్గి ప్రభుత్వాన్ని నిలబెట్టుకున్నారు.

# వేసవి అయ్యేంత వరకు బెంగళూరు వెళ్లకండి


బెంగళూరులో తీవ్ర నీటి ఎద్దడి వేధిస్తోంది. గేటెడ్ కమ్యూనిటీల్లో నివసించే ప్రజలు కూడా నీరు లేక అవసరాల కోసం వాష్‌రూమ్‌లను ఉపయోగించడానికి సమీపంలోని మాల్స్‌కు వెళ్తున్నారని అక్కడి ఓ నివాసితుడు తెలిపాడు.స్నానాల కోసమైతే ఏకంగా జిమ్‌లకు వెళ్తున్నారని ఆ వ్యక్తి పేర్కొన్నాడు. సోషల్ మీడియా వెబ్‌సైట్ రెడ్డిట్ ద్వారా తాము ఎదుర్కొంటున్న నీటి సమస్యను ఆ నివాసి తెలియజేశాడు. ప్రెస్టీజ్ ఫాల్కన్ సిటీలోని ఒక ఫ్లాట్‌లో నివాసం ఉంటున్నట్లు పేర్కొన్న ఆ వ్యక్తి తమకు చుక్క నీరు రావడం లేదని వాపోయాడు. ఆ వ్యక్తి ఇంకా మాట్లాడుతూ.. అద్దె ఇళ్లల్లో ఉండే చాలా మంది తమ ఇళ్ళు ఖాళీ చేసి వెళ్లిపోతున్నారనీ తెలిపాడు. మరికొందరు తాత్కాలిక వసతికి మారారనీ పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే.. నీరులేక టాయిలెట్ల దుర్వాసనను మీరు చాలా దూరం నుండి పసిగట్టవచ్చనీ, కొంత మంది స్థానికులు ప్రతిరోజు తమ కాలకృత్యాలు తీర్చుకోవడానికి సమీపంలోని ఫోరమ్ మాల్‌కు వెళ్లడం సర్వసాధారణమైపోయిందని ఆ వ్యక్తి తన పోస్ట్‌లో పేర్కొన్నాడు.




# పాలమూరుపై భానుడి ఉగ్రరూపం..

**గత ఐదు రోజుల్లో పెరిగిన ఉష్ణోగ్రతలు..**

మండువేసవికి ముందే భానుడి ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఏప్రిల్ నెల రాకముందే ఎండల తీవ్రత రోజురోజుకు అధికమవుతోంది. ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా భానుడి భగభగలు కనిపిస్తున్నాయి.గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40డిగ్రీల సెల్సియస్ కు చేరుకుంటున్నాయి. ఉదయం నుంచే ఎండ తీవ్రత కారణంగా ప్రజలు బయటకు రావాలంటేనే జంకుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. మే, ఏప్రిల్ నెలలో ఉండాల్సిన ఎండలు మార్చి రెండోవారంలోనే ప్రతాపం చూపిస్తున్నాయి. ఉదయం 9గంటలు దాటితే చాలు భానుడి భగభగలు మండిస్తున్నాడు. ఎండల వేడికి ఉక్కపోత సైతం తోడు కావడంతో ఉమ్మడి మహబూబ్?నగర్ జిల్లా ప్రజలు అల్లాడుతున్నారు. వరుసగా ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయికి చేరుతుండడంతో వచ్చే రెండు నెలల్లో ఎండల తీవ్రతను తలుచుకుంటేనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నెల 8 నుంచి 40డిగ్రీల సెల్సియస్ చేరువగా ఉష్ణోగ్రతలు నమోద అయ్యాయి. మార్చి 8 నుంచి నాగర్ కర్నూల్?లో 39.8, మహబూబ్ నగర్, వనపర్తి, నారాయణపేటలో 39.7, గద్వాల్?లో 39.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గడచిన ఐదురోజుల్లో ఉమ్మడి జిల్లాలో 2.6డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పెరిగాయి.ఉదయం 9గంటలకే భానుడి భగభగలు మొదలై సాయంత్రం 6గంటల వరకు కొనసాగుతున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మధ్యాహ్నానికే పనులు ముగించుకొని ఇళ్లకు చేరే ప్రయత్నాలు చేస్తున్నారు. మధ్యాహ్నం తర్వాత రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. సాయంత్రం వేళ ఎండ తీవ్రత తగ్గిన తర్వాతే ఇళ్ల నుంచి ప్రజలు బయటకు వస్తున్నారు. అటు ఎండల వేడికి ఇళ్లలో విద్యుత్ వినియోగం గరిష్ఠానికి చేరుకుంటోంది. ఇప్పుడే సూర్యుడు ఈ విధంగా ప్రతాపం చూపిస్తే రానున్న రోజుల్లో వేసవిని తలుచుకుంటేనే జిల్లా ప్రజలు భయపడుతున్నారు. ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో మిట్టమధ్యాహ్నం ఇళ్ల నుంచి బయటకు రాకుండా ఉండడమే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.



# సీఏఏతో శాంతిభద్రతలు లోపిస్తాయి: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్



న్యూఢిల్లీ: సీఏఏపై ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కీలక వ్యాఖ్యలు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో జరిగిన వలసల కన్నా ఇప్పుడే ఎక్కువ వలసలు ఉంటాయన్నారు. దేశంలో శాంతిభద్రతలు లోపిస్తాయన్నారు. దీని వల్ల దోపిడీలు, దొంగతనాలు, రేప్‌లు జరుగుతాయన్నారు. పాక్, బంగ్లా, ఆఫ్ఘన్ దేశాలకు చెందిన మైనార్టీలకు పౌరసత్వం కల్పిస్తామని సీఏఏలో ఉందని, ఇది పేద దేశమని, మనం తలుపులు తెరిస్తే, అప్పుడు వాళ్లంతా ఎక్కడ సెటిల్ అవుతారని కేజ్రీ ప్రశ్నించారు. అందుకే స్వాతంత్ర్యం నాటి రోజుల కన్నా ఇప్పుడు ఎక్కువగా మైగ్రేషన్ ఉంటుందన్నారు. గడిచిన 75 ఏళ్లలో ఢిల్లీలో 63 ఫ్లైఓవర్లు నిర్మించారని, కానీ గత పదేళ్ల ఆప్ పాలనలో 31 ఫ్లైఓవర్లు నిర్మించామని ఆయన తెలిపారు.

# 'నన్ను ఎవరూ కిడ్నాప్ చేయలేదు.. బీఆర్ఎస్‌లోనే ఉన్నా'



హైదరాబాద్: గత రెండు రోజులుగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ పార్టీ మారబోతున్నారని వార్తలు వైరల్ అయ్యాయి. ఆయన బీఆర్ఎస్ పార్టీ మారి బీజేపీలో చేరుతున్నారని చర్చ జరిగింది.ఆయన పార్టీ మార్పుపై వరంగల్‌లో ఈరోజు హైడ్రామా కొనసాగింది. ఏకంగా ఆయన్ను బీజేపీలో చేరకుండా బీఆర్ఎస్ నాయకులే కిడ్నాప్ చేశారని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆరూరి.. బీఆర్ఎస్ పార్టీ సీనియర్‌నేత ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి హైదరాబాద్ వచ్చి కేసీఆర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆరూరి రమేష్ మిడయాతో మాట్లాడారు. 'బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నా. అమిత్ షాను కలవలేదు.. కానీ, బీజేపీ నాయకులను మాత్రమే కలిశాను. మా పార్టీ నేతలే నన్ను తీసుకుని వచ్చారు. నన్ను బీఆర్ఎస్ నేతలు కిడ్నాప్ చేయలేదు. మా పార్టీ నేతలు నన్ను కిడ్నాప్ ఎందుకు చేస్తారు?' అని ఆరూరి స్పష్టత ఇచ్చారు.

# ఆరూరి ఇంటి వద్ద హైడ్రామా.. బీజేపీ నేతలు సీరియస్

హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలకు ముందు తెలంగాణ రాజకీయాల్లో నాటకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. బీఆర్ఎస్ నేత ఆరూరి రమేష్ బీజేపీలో చేరేందుకు రెడీ కావడంతో ఆయన ఇంటి వద్ద హైడ్రామా క్రియేట్ అయ్యింది.రంగంలోకి దిగిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ ఆయనను తన కారుతో వేరే చోటకు తరలించారు. ఇక, పరిణామాలపై బీజేపీ నేత సీతారాం నాయక్ స్పందించారు.ఈ సందర్భంగా సీతారాం నాయక్ మీడియాతో మాట్లాడుతూ.. ఆరూరి రమేష్ ఇంటి వద్ద చోటుచేసుకున్న పరిణామాలు నాటకీయంగా ఉన్నాయి. నిన్న(మంగళవారం) అమిత్ షాను కలిసి బీజేపీలో చేరేందుకు రమేష్ రెడీ అయ్యారు. ఈరోజు ప్రెస్‌మీట్ పెట్టి బీజేపీలో జాయిన్ అవుతున్నా అని ప్రకటిస్తున్నానని మాకు చెప్పారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలు ఆరూరి ఇంటికి వెళ్లి ప్రవర్తించిన తీరు సరికాదు. రమేష్ తన ఇష్టంతో సొంత నిర్ణయం తీసుకుంటే వీరికి వచ్చిన బాధేంటి?.బీఆర్ఎస్ నేతలు రమేష్ జీవితం నాశనం చేయాలని చూస్తున్నారు. ఈ డ్రామాలన్నీ ప్రజలు చూస్తున్నారు. గతంలో నా రాజకీయ జీవితం కూడా బీఆర్ఎస్ నేతలే నాశనం చేశారు. నాకు ఃఖీూ చేసిన అన్యాయంపై 151 బుక్స్ రాయవచ్చు. దళితులకు వీళ్ళు గతంలో ఏమి చేశారని ఇప్పుడు వచ్చి బీఆర్ఎస్ వాళ్లు ఎం హామీ ఇస్తారు?. గతంలో ఎప్పుడైనా ఆరూరికి ఎర్రబెల్లి మద్దతుగా ఉన్నాడా?. ఆరూరి జీవితంతో ఎర్రబెల్లి, బీఆర్ఎస్ నేతలు ఆడుకోవద్దంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.



# బీజేపీలోనే ఉన్నా.. పార్టీ కోసం పని చేస్తా: అనిల్ విజ్

చండీగఢ్: తాను బీజేపీలోనే ఉన్నానని హర్యానాకు చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు అనిల్ విజ్ తెలిపారు. బీజేపీ భక్తుడినన్న ఆయన, పార్టీ కోసం పని చేస్తానని చెప్పారు. హర్యానా సీఎం మార్పు నేపథ్యంలో ఆ పదవి ఆశించిన అనిల్ విజ్ పార్టీ అధిష్టానం నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కొత్త సీఎంగా నయాబ్ సైనీని ఎన్నుకోవడంతో బీజేపీ లెజిస్లేచర్ పార్టీ మీటింగ్ నుంచి అనిల్ విజ్ వాకౌట్ చేశారు. మీటింగ్‌లో ఏం జరిగిందని మీడియా ప్రశ్నించగా ఢిల్లీ నుంచి వచ్చిన నేతలు చెబుతారంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.కాగా, సీఎంగా నయాబ్ సైనీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కూడా అనిల్ విజ్ హాజరుకాలేదు. అయితే ఒక రోజు తర్వాత ఆయన కొంత శాంతించారు. తాను ఇప్పటికీ బీజేపీలో ఉన్నానని స్పష్టం చేశారు. 'నేను బీజేపీ భక్తుడ్ని. పరిస్థితులు మారవచ్చు కానీ నేను పార్టీ కోసం పని చేస్తూనే ఉంటా' అని అన్నారు.మరోవైపు 2014లో హర్యానాలో సొంత బలంతో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి పదవి రేస్‌లో అనిల్ విజ్ ఉన్నారు. అయితే తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన మనోహర్ లాల్ ఖట్టర్‌ను సీఎంగా బీజేపీ అధిష్టానం ఎంపిక చేసింది. దీంతో అనిల్ విజ్ నాడు కూడా పార్టీ నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.



# తెలంగాణలో మోడీ గాలి..కేంద్రంలో మళ్లీ బీజేపీదే అధికారం

**మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి**

సూర్యాపేట,హుజూర్ నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి టెలికాన్ఫరెన్స్ వాయిస్ రికార్డ్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఢిల్లీ నుంచి హఠాత్తుగా బిజెపి అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది...నల్గొండ ఎంపీ టికెట్ ఆఫర్ ఇస్తే కండువా కప్పుకున్నా. తెలంగాణ లో మోడీ గాలి వీస్తుంది...10 నుంచి 12 ఎంపి సీట్లు బిజెపి గెలుస్తుంది. కేంద్రంలో మళ్ళీ బీజేపీదే అధికారం.. మోడీనే మళ్ళీ ప్రధాని అవుతారు. బీఆర్ఎస్ లో పోటీ అంటేనే నేతలు భయపడి పోతున్నారు...ఆర్థిక బలం ఉన్న రంజిత్ రెడ్డి, పైళ్ల శేఖర్ రెడ్డి కూడా బ్యాకయ్యారు. సీఎం రేవంత్ రెడ్డిని దింపాలని కాంగ్రెస్ వాళ్ళే అనుకుంటున్నారు....ఆ వ్యతిరేక బ్యాచ్ కు బీఆర్ఎస్ నేతలే మద్దతు ఇస్తారు....ఈ కుట్రలు,కుతంత్రాలు మనకు అవసరమా ? మీకు తెలియకుండా పార్టీ మారినందుకు క్షమించండి....మీరంతా నన్ను నమ్ముకుని పనిచేయండి.

## పవన్ కళ్యాణ్ ను ఎర్రగడ్డ ఆసుపత్రిలో చూపించాలి

భీమవరం,పవన్ కళ్యాణ్ కామెంట్స్ పై భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ స్పందించారు. 24 సీట్లకు పరిమితం అయ్యి చంద్రబాబు మోచేతి నీళ్ళు పవన్ కళ్యాణ్ తాగేందుకు సిద్ధం అయ్యారు. 24సీట్లకు ఒప్పుకుని ఇపుడు 21సీట్లు అంటున్నారు. సొంత అన్నయ్యతో విభేదించా అంటున్నారు.. చిరంజీవి కి పవన్ కు పోలిక ఎంటని అన్నారు. ప్రజారాజ్యం కు 18సీట్లు, 80లక్షల ఓట్లు వచ్చాయి.. చిరంజీవి చాలా సౌమ్యుడు. మరో అన్న నాగబాబుకి పవన్ కళ్యాణ్ అన్యాయం చేశారు. పవన్ కళ్యాణ్ ను మంచి మానసిక వైద్యుడికి, ఎర్రగడ్డ ఆసుపత్రిలో చూపించాలని అనే అనుమానం వస్తుంది. వ్యాధి ముదిరితే ప్రాణాంతకం అవుతుంది. పవన్ కామెంట్స్ చూస్తుంటే గురివింద గింజ సామెత గుర్తుకు వస్తుంది. ప్రజా రాజ్యం పార్టీ నాటి నుంచి పవన్ భాష ఏ రకంగా ఉందో అందరికీ తెలుసు. ఇల్లు కొనడానికి వస్తే నేను అడ్డుకున్నానని పవన్ కళ్యాణ్ అంటున్నారు. పవన్ వస్తే నాకు ఉన్న 9 ఏకరాల్లో ఎంత కావాలంటే అంత ఇస్తా. భీమవరం వచ్చి ప్రజలు నీ గురించి ఏమి అనుకుంటున్నారో ఒక్కసారి పవన్ తెలుసుకోవాలి. నీ అభిమానులకు సెల్ఫీ దిగే అవకాశం కూడా లేదు.

# విపక్షాలకు ఇబ్బందులు తప్పవా



విజయవాడ, మార్చి 13, తెలుగుదేశం పార్టీతో బిజెపి పొత్తు కుదిరే పని కాదని విశ్లేషణలు వచ్చాయి. అసలు బిజెపి టిడిపి రూట్లోకి రాదని కూడా వైసిపి అనుకూల వర్గాలు చెప్పుకొచ్చాయి. ఒకవేళ పొత్తు కుదిరినా బిజెపిఎక్కువ సీట్లు కోరుతుందని.. పవర్ షేరింగ్ సైతం అడుగుతుందని.. తనకు కాకున్నా పవన్ అడ్డం పెట్టుకొని రాజకీయం చేస్తుందని వైసిపి అనుకూల మీడియా విశ్లేషించింది. అసలు టిడిపిని కలుపుకెళ్లేందుకు బిజెపి అగ్ర నేతలు ఇష్టపడడం లేదని కూడా తేల్చి చెప్పింది. వైసీపీ అంటేనే బిజెపికి అపార గౌరవం అని.. టిడిపికి డోర్స్ క్లోజ్ అయినట్టేనని రకరకాల ప్రచారం జరిగింది. వీటన్నింటిని తెరదించుతూ బిజెపి తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకుంది. పది అసెంబ్లీ సీట్లు, ఆరు పార్లమెంట్ స్థానాలతో సరిపెట్టుకుంది. అయితే ఈ మొత్తం వ్యవహారంలో వైసిపి మాట చెల్లుబాటు కాకుండా పోయింది.ఇప్పటివరకు నేషనల్ మీడియా సంస్థలు ఏపీలో సర్వేలు చేశాయి. మెజారిటీ సర్వేలు వైసీపీకి అనుకూలంగా ఉన్నాయి. కొన్ని సంస్థలు అయితే ఏకపక్షంగా వైసిపి గెలుపొందుతుందని తేల్చి చెప్పాయి. అయినా సరే బీజేపీ టిడిపి పొత్తుకు ఒప్పుకుందంటే సాహసం అనే చెప్పాలి. పైగా అన్ని విధాలా సహకారం అందించే జగన్ రూపంలో వైసిపి ఉంది. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ ఏకపక్షంగా పార్లమెంట్ స్థానాలను గెలిచే ఛాన్స్ ఉంది. అయినా సరే బిజెపి పెద్దలు వైసీపీని పట్టించుకోకుండా టిడిపి తో పొత్తు పెట్టుకోవడం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.సర్వే సంస్థలు తప్పుడు నివేదికలైనా ఇచ్చి ఉండాలి.లేకుంటేబిజెపి అగ్ర నేతలు సొంతంగా సర్వే చేయించి ఉండాలి.ఈ

### బీజేపీ బలం చూపేనా

రెండింటిలో ఏదో ఒకటి జరిగి ఉండాలి.ఒక జాతీయస్థాయిలో మూడోసారి అధికారంలోకి రావాలనుకుంటున్న బిజెపి.. గెలవాలనుకుంటున్న పార్టీతోనే కలుస్తుంది కానీ.. ఓడిపోయే పార్టీతో చేయి కలిపే ఛాన్స్ లేదు.వాస్తవానికి ఏపీలో పరిస్థితులపై బీజేపీకి స్పష్టమైన అవగాహన ఉంది.బిజెపి అగ్రనేతలు రాష్ట్రంలో ఉన్న రాజకీయ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. కొన్ని జాతీయ మీడియాలు చేసిన సర్వేలను వారు పరిగణలోకి తీసుకోలేదని తెలుస్తోంది. కేంద్రానికి సైతం కొన్ని నిఘా సంస్థలు ఉంటాయి. వాటిపైన కేంద్రం ఆధారపడుతుంది.వాటి నివేదికల ఆధారంగానే కేంద్రం పొత్తులపై ఒక నిర్ణయం తీసుకుంటుందన్న అభిప్రాయం ఉంది.ఏపీలో విపక్షాలకు ఇబ్బందికర పరిస్థితులు ఉంటే ఈపాటికే నిఘా సంస్థలు హెచ్చరించి ఉండేవి కదా? కానీ బిజెపి విపక్షాలతో కలవడం ఏమిటి? తనకు అన్ని విధాలా సహకరిస్తున్న జగన్ ఉండగా.. గత ఎన్నికలకు ముందు దారుణంగా దెబ్బతీసిన చంద్రబాబును నమ్మడం ఏంటి? ఇప్పుడు ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. ఆ మూడు పార్టీల మధ్య పొత్తు సవ్యంగా ముందుకు సాగుతోంది. సీట్ల సర్దుబాటు సైతం ఒక కొలిక్కి వస్తోంది. మొత్తానికైతే కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ఏపీ విషయంలో తీసుకున్న నిర్ణయం సైతం హాట్ టాపిక్ గా మారుతోంది. ఏపీలో గెలుపోటములను పరిగణలోకి తీసుకునే బిజెపి నిర్ణయం తీసుకొని ఉంటుందన్న అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో బీజేపీ బలం ఎంత అంటే, పొరుగున ఉన్న తెలంగాణతో పోలిస్తే తక్కువే అన్నది మాత్రం నిర్వివాదంశం. ఏపీలో బీజేపీకి సైద్ధాంతికంగా బలమైన మద్దతుదారులు ఉన్నా, రాజకీయాల్లో సొంతంగా అభ్యర్థులను గెలిపించుకునే స్థాయిలో మాత్రం లేదు. అందుకే కనీసం కార్పొరేటర్లుగా కూడా బీజేపీ అభ్యర్థులు పోటీ చేసి గెలిచే పరిస్థితులు లేవనే విమర్శ ఎదుర్కోవాల్సి వచ్చేది.బీజేపీ ఆవిర్భావం నుంచి నలభై ఏళ్లలో దేశంలో 2 పార్లమెంటు స్థానాల నుంచి సొంతంగా దేశంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్థాయికి ఎదిగినా ఏపీలో మాత్రం ఆ పార్టీ ఎందుకు ఎదగలేక పోయిందనే చర్చ పలు మార్లు చర్చకు వచ్చింది.ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ నీడలో ఉండిపోవడం వల్లే ఏపీలో బీజేపీ ఎదగలేదనే విమర్శ ఉంది. 2018లో బీజేపీతో టీడీపీ తెగదెంపులు చేసుకున్నా తర్వాత మళ్లీ ఆ పార్టీతో జట్టు కట్టేది లేదని బీజేపీ ప్రకటించింది. అయితే అనూహ్యంగా 2024 నాటికి ఆ రెండు పార్టీలు మళ్లీ జట్టు కట్టాయి.2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు 117 స్థానాల్లో పోటీ చేశారు. పోటీ చేసిన ప్రతిచోట డిపాజిట్లు కోల్పోయారు. రాష్ట్రంలో పోలైన ఓట్లలో బీజేపీకి కేవలం 0.85శాతం ఓట్లు మాత్రమే దక్కాయి. 2019లో వామపక్షాలతో కలిసి పోటీ చేసిన జనసేనకు 7శాతం లోపు ఓట్లు వచ్చాయి.ఏపీల సొంతంగా ఎదగడానికి ఐదేళ్లలో బీజేపీ రకరకాల ప్రయత్నాలు చేసింది. ఏపీలో కమ్మ సామాజిక వర్గం టీడీపీకి, రెడ్లు వైసీపీ వైపు ఉండటంతో మూడో బలమైన సామాజిక వర్గం కాపుల్ని ఆకర్షించేందుకు వారికి రాష్ట్ర బాధ్యతలు అప్పగించింది. మొదట కన్నా లక్ష్మీనారాయణ, తర్వాత సోము వీర్రాజులకు బాధ్యతలు అప్పగించారు. ఐదేళ్ల తర్వాత అనూహ్యంగా దగ్గుబాటి పురందేశ్వరికి అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు.ఏపీ బీజేపీలో సిద్ధాంతపరంగా ఆర్ఎస్ఎస్ అనుకూల బీజేపీ వర్గంతో పాటు టీడీపీ అనుకూల వర్గం ఒకటి, వైసీపీ అనుకూల వర్గం ఇంకోటి ఉన్నాయి. ఈ క్రమంలో 2024 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తే మళ్లీ 2019 ఫలితాలు పునరావృతం అవుతాయనే అవగాహన కూడా బీజేపీ పెద్దలకు ఉంది.అదే సమయంలో టీడీపీతో జత కలిసే విషయంలో కూడా బీజేపీ నేతల్లో బిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఏపీలో అధికారంలో ఉన్న వైఎస్సార్సీపీ ఎన్డీఏలో మిత్రపక్షంగా లేకున్నా మోదీ మాట జవదాటని పార్టీగా నమ్మకాన్ని సంపాదించుకున్నారు. ఇప్పుడు ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమితో కలిసి పోటీ చేయడం ద్వారా బీజేపీ వీలైనన్ని పార్లమెంటు స్థానాలలను దక్కించుకోవాలని భావిస్తోంది.దేశంలోని అన్ని రాష్ట్రాల్లో బీజేపీ ప్రాతినిథ్యం ఉండాలనే లక్ష్యంతోనే టీడీపీ-జనసేన కూటమితో కలిసి ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమైంది. గెలుపోటములు, సీట్ల సంఖ్యతో సంబంధం లేకుండా ఏపీలో గెలిచే స్థానాలన్నీ తమకే దక్కుతాయనే అంచనాతో బీజేపీ ఉంది. ఆంధ్రప్రదేశ్ నుంచి బీజేపీ సొంతంగా గెలిచే స్థానాలతో పాటు మిగిలిన పార్టీలు గెలిచే స్థానాలు కూడా తమ చెప్పు చేతల్లోనే ఉంటాయనే అంచనా బీజేపీకి ఉంది.

## ప్రచార రథంలో రెండు బాక్సులు

నెల్లూరు, మార్చి 13,ఏపీలో టీడీపీ, జనసేనతో పొత్తు ఖరారు కావటంతో ఏపీ బీజేపీ ఎన్నికల మూడ్‌లోకి వచ్చేసింది. ఇప్పటి వరకూ పొత్తులు ఉంటాయా, లేదా ఒంటరి పోరా అనే సందేహంలో కొట్టుమిట్టాడిన ఏపీ బీజేపీ నేతలు.. ఇక విజయమే లక్ష్యంగా కార్యాచరణ ప్రారంభించేందుకు రెడీ అయ్యారు. ఓ వైపు కూటమిలోని ఇతర పార్టీలను సమన్వయం చేసుకుంటూనే తమదైన గుర్తింపు సంపాదించుకునే ప్రయత్నాల్లో పడ్డారు. ఈ క్రమంలోనే ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి బీజేపీ ప్రచార రథాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పురంధేశ్వరి మ్యానిఫెస్టో రూపకల్పన కోసం బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను వివరించారు.మ్యానిఫెస్టో తయారీలో ప్రజలను భాగస్వామ్యం చేయనున్నట్లు దగ్గుబాటి పురంధేశ్వరి తెలిపారు. ప్రచార రథాల్లో ప్రజల అభిప్రాయ సేకరణ పత్రాలను బాక్స్‌లో ఉంచుతామని పురంధేశ్వరి తెలిపారు. "ప్రచార రథాలలో రెండు బాక్సులు ఉంటాయి. ఒక బాక్సులో కేంద్రంనుంచి మీరేమీ ఆశిస్తున్నారో అభిప్రాయాలు సేకరిస్తాం. మరో బాక్సులో రాష్ట్రం కోసం ఏం కావాలో అభిప్రాయాలు సేకరిస్తాం. కోటిమంది నుంచి అభిప్రాయాలు సేకరించడమే లక్ష్యం. ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని మ్యానిఫెస్టోలో చేరుస్తాం" అని పురంధేశ్వరి వివరించారు.జాతీయస్థాయి మేనిఫెస్టో, అదేవిధంగా రాష్ట్రస్థాయి కి విడివిడిగా ప్రజల అభిప్రాయాలను స్వీకరిస్తామన్న పురంధేశ్వరి.. ఏపీవ్యాప్తంగా 45వేల కుటుంబాల నుంచి అభిప్రాయాలను సేకరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇదే సమయంలో టీడీపీతో పొత్తుపైనా పురంధేశ్వరి కీలక వ్యాఖ్యలు చేశారు. టీడీపీతో పొత్తు ఖరారైందనీ, ఎన్నిసీట్లు, ఎక్కడనుంచి పోటీ అనేది రెండు రోజుల్లో తేలిపోతుందని చెప్పారు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసమే పొత్తులన్న పురంధేశ్వరి.. వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన అవసరం ఉందన్నారు. అంతటి రాముడే ఉడత సాయం తీసుకున్నారన్న పురంధేశ్వరి.. రాముడు అంతటి వాడు సహకారం తీసుకోగా, బీజేపీ తీసుకుంటే తప్పేంటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అధిష్టానం తీసుకునే ఏ నిర్ణయానికైనా అందరూ కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు.

## నెల్లూరులో చేతులు కలిపిన బొల్లినేని, కాకర్ల..

నెల్లూరు, మార్చి 13, ల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం విషయంలో చంద్రబాబు వ్యూహం వర్కవుట్ అయ్యేలా ఉంది. స్థానికంగా వైరి వర్గాలుగా ఉన్న ఇద్దర్ని ఆయన ఒక దగ్గరకు చేర్చారు. పార్టీ గెలుపుకోసం పనిచేయాలని సూచించారు. కేవలం సూచనే కాదు, అందులో ఒకరికి పార్టీలో కీలక పదవి కూడా ఇచ్చారు. ఇంకేముంది ఆయన మెత్తబడ్డారు. టికెట్ తనకు రాకపోయినా పర్లేదంటూ సైలెంట్ అయ్యారు. దీంతో టికెట్ దక్కించుకున్న వారికి లైన్ క్లియర్ అయింది. చంద్రబాబు చాణక్యాన్ని నెల్లూరు జిల్లా నాయకులు మెచ్చుకుంటున్నారు. నెల్లూరు జిల్లా ఉదయగిరిలో 2019లో వైసీపీ గెలిచింది. మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి వైసీపీ ఎమ్మెల్యేగా గెలిచినా కాలక్రమంలో ఆయన టీడీపీలో చేరారు. ఆల్రెడీ అక్కడ టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు పార్టీలోనే ఉన్నారు. అయితే గియితే వారిద్దర్లో ఒకరికి టికెట్ వస్తుందని అందరూ అనుకున్నారు. కానీ చంద్రబాబు అనూహ్యంగా అక్కడ ఓ ఎన్నారైని తెరపైకి తెచ్చారు. కాకర్ల సురేష్ అక్కడ టీడీపీ టికెట్ దక్కించుకున్నారు, ప్రచారం మొదలు పెట్టారు. వైసీపీనుంచి వచ్చి చేరిన మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, టీడీపీ టికెట్ లేకపోవడంతో దిగాలు పడి పార్టీకి దూరంగా ఉంటున్నారు. ఇక బొల్లినేని రామారావు మాత్రం తనకు టికెట్ రాకపోవడంతో అలకబూనారు, కాకర్ల సురేష్ ని ఓడించి తీరతానంటూ ప్రతిజ్ఞ చేశారు. అక్కడితో టికెట్ దక్కిన సంతోషం కూడా కాకర్లకు లేకుండా పోయింది. మాజీ ఎమ్మెల్యే, తనకంటే ముందు టీడీపీ అభ్యర్థిగా చెలామణి అయిన బొల్లినేనితో వైరం తనకు మంచిది కాదని ఆయన కూడా కాస్త సైలెంట్ గా ఉన్నారు. బొల్లినేనిపై ఎక్కడా మాట తూలలేదు, ఆయన్ను విమర్శించలేదు. దీంతో చివరకు పంచాయితీ చంద్రబాబు వద్దకు చేరింది. ఇక్కడ చంద్రబాబు తన చాణక్యాన్ని ప్రదర్శించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావుకి టీడీపీ జాతీయ ఉపాధ్యక్ష పదవిని ఇచ్చారు. ఢిల్లీలో పార్టీ వ్యవహారాలు చక్కబెట్టాలని సూచించారు. ఆ పదవి వల్ల ఉపయోగం ఉన్నా లేకపోయినా బొల్లినేని కాదనలేకపోయారు.

జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు చంద్రబాబుకు థ్యాంక్స్ చెప్పి ఉదయగిరికి వచ్చేశారు.ఇక ఉదయగిరిలో సీన్ మారింది. టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్.. బొల్లినేని రామారావుని కలసి అభినందనలు తెలిపారు. ఆయనకు పార్టీ జాతీయ ఉపాధ్యక్ష పదవి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆయనకున్న రాజకీయ అనుభవాన్ని జోడించి ముందుకు నడిపించాలని కోరారు. నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశం కూడా బొల్లినేని రామారావు ఆధ్వర్యంలో జరగడం విశేషం. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని 8 మండలాలకు సంబంధించిన కన్వీనర్ లు మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావుకు జాతీయస్థాయిలో పదవి రావడం పట్ల నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. పార్టీ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తానన్నారు బొల్లినేని. తన అనుచరులు, అభిమానులు కూడా తనమాటపైనే ఉండాలని, పార్టీకోసం పనిచేయాలని ఆదేశించారు. ఉదయగిరి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థిని గెలిపించి చంద్రబాబుకి ఆ విజయాన్ని బహుమతిగా ఇస్తామన్నారు. మొత్తానికి ఇద్దరు నేతలు చేతులు కలపడంతో ఈ కథ సుఖాంతమైనట్టు తెలుస్తోంది.

## ఒకేసారి టీడీపీ అభ్యర్థుల ప్రకటన

విజయవాడ, మార్చి 13, టిడిపి అభ్యర్థుల ఎంపికపై చంద్రబాబు ఫోకస్ పెట్టారు. ఒకవైపు భాగస్వామ్య పక్షాలతో సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుపుతున్నారు. మరోవైపు సొంత పార్టీ అభ్యర్థుల ఎంపికపై దృష్టి పెట్టారు. జనసేనతో పొత్తు కుదిరిన నేపథ్యంలో ఆ రెండు పార్టీల తొలి జాబితా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ 94 మందితో తొలి జాబితాను ప్రకటించింది. జనసేన, బిజెపికి కేటాయించిన సీట్లు పోను.. మిగతా నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించేందుకు చంద్రబాబు కసరత్తు చేస్తున్నారు. ఈరోజు సాయంత్రానికి ఆ రెండు పార్టీలతో సీట్ల సర్దుబాటు ప్రక్రియ ఒక కొలిక్కి రానుంది. దీంతో రెండు రోజుల్లో రెండో జాబితాను క్లియర్ చేయాలని చంద్రబాబు భావిస్తున్నారు. దీంతో ఆశావహుల్లో ఒక రకమైన టెన్షన్ నెలకొంది.టిడిపి తొలి జాబితాలో చాలామంది సీనియర్లకు టికెట్లు దక్కలేదు.అనూహ్యంగా కొంతమంది జూనియర్లు టికెట్లు దక్కించుకున్నారు.టికెట్లు ప్రకటించని వారిలో పొలిట్ బ్యూరో సభ్యులు సైతం ఉన్నారు. అయితే తొలి జాబితాలో టికెట్లు దక్కని సీనియర్లను పిలిచి చంద్రబాబు బుజ్జగించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణం మీ అందరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో చాలామంది సీనియర్లు మెత్తబడ్డారు. ఇప్పుడు రెండో జాబితాలో దాదాపు 50 మంది అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. ఇప్పుడు కూడా వివిధ కారణాలతో టిక్కెట్లు ఇవ్వని వారికి పిలిపించి మాట్లాడే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకుగాను సీనియర్లతో కూడిన ఒక కమిటీని ఏర్పాటు చేశారు.మరోవైపు ఎంపీ అభ్యర్థులను సైతం ఖరారు చేసేందుకు చంద్రబాబు సిద్ధపడుతున్నారు. రెండో జాబితాలోనే ఎంపీ అభ్యర్థుల ప్రకటనకు కసరత్తు చేస్తున్నారు. పొత్తులో భాగంగా జనసేనకు రెండు, బిజెపికి ఆరు పార్లమెంట్ స్థానాలను కేటాయించిన సంగతి తెలిసిందే. మిగతా 17 నియోజకవర్గాల్లో అభ్యర్థులను చంద్రబాబు ఇప్పటికే పూర్తి చేశారు. ఒంగోలు సిట్టింగ్ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి టిడిపిలో చేరిక ఖాయమైంది. ఒంగోలు సీటును ఆయన కుమారుడు రాఘవరెడ్డికి కేటాయించే ఛాన్స్ కనిపిస్తోంది. అయితే ఎంపీ అభ్యర్థులకు సంబంధించి చాలా చోట్ల ఆశావహులు అధికంగా ఉన్నారు. గుంటూరు లాంటి చోట్ల ఎన్నారైలు సైతం సిద్ధంగా ఉన్నారు.

## పీలేరులో మూడోసారి విజయం ఎవరది

తిరుపతి, మార్చి 13, నియోజకవర్గానికి రాజకీయాల్లో ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ నియోజకవర్గంలో ప్రశాంత రాజకీయం జరుగుతుందని అన్ని పార్టీల నాయకులు చెప్పే మాట. ఈ నేపథ్యంలో రెండు పార్టీలకు చెందిన నాయకులు ఏ పార్టీ వైపు మగ్గు చూపుతారో వేచి చూడాలి ఉంది. ఒక నాయకుడు మూడోసారి విజయం సాధించాలని చూస్తుంటే... మరో నాయకుడు మూడోసారి అయిన విజేతగా నిలవాలని ఉన్నారు.పీలేరు నియోజకవర్గం 1965లో ఏర్పడింది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉండగా ప్రస్తుతం అన్నమయ్య జిల్లాకు విభజనలో వెళ్లింది. పీలేరు శాసన సభ నియోజకవర్గం రాజంపేట లోక్ సభ పరిధిలోకి వస్తుంది. ఇందులో పీలేరు, వాల్మీకిపురం (వాయల్పడు), గుర్రంకొండ, కలికిరి, కలకడ, కంభంవారిపల్లి మండలాలు ఉన్నాయి.ప్రస్తుతం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి. రాష్ట్ర విభజనకు ముందు ప్రజారాజ్యం పార్టీ తరపున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం జరిగిన 2014 ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేశారు మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి సోదరుడు కిషోర్ కుమార్ రెడ్డిపై గెలుపొందారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో అదే ప్రత్యర్థి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పై రెండోసారి విజయం సాధించారు. రాబోయే ఎన్నికల్లో ఇప్పటి వరకు వైసీపీ అభ్యర్థి ప్రకటన చేయలేదు. ఆయన తరువాత ఆ స్థాయి నాయకులు లేరని.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సన్నిహితుడని.. తప్పకుండా ఆయనకే సీటు ఇస్తారని అంటున్నారు. ఆయనకే సీటు ఇస్తే మూడోసారి ఎమ్మెల్యే అవుతారా.. వాల్మీకిపురంలో సాయిబాబా ఆలయం నిర్మించిన ఎమ్మెల్యే... ట్రస్ట్ తరపున నిత్య అన్నదానం, వైద్య శిబిరాలు వంటి సేవ కార్యక్రమాలు నిర్వహిస్తారని ప్రచారం ఉంది. గత 4 ఏళ్లుగా గ్రామస్థాయిలో ఆయన పేరు చెప్పి అనుచరులు కబ్జాలు చేశారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. సుమారు వెయ్యి కోట్ల మేర ప్రభుత్వ భూముల అమ్మకాలు జరిగాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అధికారం ఉందని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా తీరుపై ప్రజలు అసహనం ఉందని అంటున్నారు.

# రాపాక... యూ టర్న్...



కాకినాడ, మార్చి 13, గత ఎన్నికల్లో జనసేన నుంచి గెలిచిన ఒకే ఒక ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్. కనీసం పవన్ పై కృతజ్ఞతా భావం చూపకుండా వైసిపిలోకి ఫిరాయించారు. గత ఐదేళ్లుగా వైసీపీ ఎమ్మెల్యే గానే చలామణి అయ్యారు. కనీసం జనసేన బీఫారంపై గెలిచానని కూడా ఆయనకు గుర్తులేదు. తన అధినేత పవన్ కాదు జగన్ అన్నట్టు ప్రవర్తించారు. జగన్ పై ప్రత్యేకతలు విమర్శిస్తే.. సొంత పార్టీ ఎమ్మెల్యేల కంటే వరప్రసాద్ ఎదుర్కొనేవారు. అయితే ఇప్పుడు ఎన్నికలు సమీపించేసరికి జగన్ రాపాకను సైడ్ చేశారు. రాజోలు అసెంబ్లీ టికెట్ ఇవ్వలేదు. అమలాపురం ఎంపీగా పోటీ చేయాలని సూచించారు. దీంతో అయిష్టత గానే మొగ్గు చూపారు రాపాక. రోజులు గడుస్తున్న కొలది నాకు అమలాపురం టికెట్ వద్దు.. రాజోలే ముద్దు అంటూ తేల్చి చెబుతున్నారు. నాకు గానీ అసెంబ్లీ టిక్కెట్ ఇవ్వకుంటే రాజోలు నియోజకవర్గం లో వైసీపీ ఓడినట్టేనని తేల్చి చెబుతుండడంతో వైసిపి అధినేత జగన్ మైండ్ బ్లాక్ అవుతోంది.గత ఎన్నికల్లో జనసేన 135కు పైగా స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టింది. పవన్ అయితే రెండు చోట్ల పోటీ చేశారు. కానీ రెండు చోట్ల ఓడిపోయారు. ఇలా అధినేత ఓడిపోయినా రాజోలు నుంచి రాపాక వరప్రసాద్ గెలుపొందారు. అయితే పార్టీకి ఒకే ఒక ఎమ్మెల్యేగా గుర్తింపు పొందినా..దానిని కూడా వదులుకున్నారు రాపాక. ఎన్నికల అనంతరం ఆరు నెలలకే వైసీపీ గూటికి చేరారు. తనను గెలిపించిన జనసైనికులను విడిచిపెట్టారు. తనకు వైసీపీలో గుర్తింపు ఉందని భావించారు. అటు జగన్ సైతం రాపాక వరప్రసాద్ ను ప్రోత్సహించారు. దీంతో తనకు ఎన్నికల్లో తిరుగు లేదని.. మరోసారి ఎమ్మెల్యేగా గెలుస్తానని రాపాక ధీమా వ్యక్తం చేశారు. అయితే ఆయన ఒకటి తెలిస్తే.. జగన్ మరోలా తలిచారు. రాజోలు టిక్కెట్ ఇవ్వనని తేల్చేశారు. అమలాపురం ఎంపీగా వెళ్లాలని సూచించారు. తొలుత అదో గౌరవం గా భావించిన రాపాక ఇప్పుడు అసలు విషయాన్ని గ్రహించారు. అమలాపురం ఎంపీ స్థానం నుంచి పోటీ చేస్తే ఓటమి ఖాయమన్న సంకేతాలు గుర్తించారు. అందుకే రాజోలు అసెంబ్లీ టికెట్ కోసం పరితపిస్తున్నారు.తాజాగా వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో రాపాక వరప్రసాద్ నాయకత్వంపై తిరుగుబాటు చేశారు.2014,2019 ఎన్నికల్లో రాజోలు నుంచి వైసీపీ అభ్యర్థి ఓడిపోయిన విషయాన్ని గ్రహించారు. తనకు కాకుండా వేరే ఎవరికైనా సీటు ఇస్తే మరోసారి వైసిపి ఓడిపోవడం ఖాయం అని తేల్చి చెప్పారు. దీంతో ఇది వైసీపీలో చర్చనీయాంశంగా మారింది. అదును చూసి రాపాక దెబ్బ కొట్టారని కామెంట్స్ వినిపిస్తున్నాయి. రాపాక వరప్రసాద్ ధిక్కారస్వరం వినిపించినట్టేనని తెలుస్తోంది. ఆయన ఎంపీగా పోటీ చేయడం లేదని ఖాయం అయ్యింది.ఇటీవల టిడిపి టికెట్ నిరాకరించడంతో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు వైసీపీలో చేరారు. ఇలా ఆయన చేరారో లేదో రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ ను ఆయనకు కేటాయించారు. ఇది రాపాక వరప్రసాద్ కు మింగుడు పడలేదు. జనసేన ఏకైక ఎమ్మెల్యేగా ఉన్న తాను నాయకత్వాన్ని విభేదించి వైసిపి గూటికి చేరుకుంటే ఇలా పక్కన పెడతారా? ఎంపీగా పోటీ చేయమంటారా? టిడిపి నుంచి వచ్చిన వ్యక్తికి టికెట్ ఇస్తారా? అంటూ రాపాక వరప్రసాద్ చిందులు వేసినట్లు తెలుస్తోంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**